# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 29-01-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

### ముఖ్యాంశాలు

- ❖ మహాకుంభమేళాలో మౌని అమావాస్య సందర్భంగా ఈరోజు జరిగిన తొక్కిసలాటలో మరణించిన వారికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంతాపం తెలియజేశారు.
- ❖ దేశ ఆర్థికాభివృద్ధికి ఖనిజాలు కీలకమని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు.
- ❖ పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ఈ నెల 31వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి.
- ❖ భారత గణతంత్ర దినోత్సవ ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి.
- ❖ 'మహాకుంభ్ 2025 – స్వర్ణిమ్ భారత్.. విరాసత్ ఔర్ వికాస్' ఇతివృత్తంతో ప్రదర్శించిన ఉత్తరప్రదేశ్ శకటం మొదటి బహుమతి లభించింది.

================================

కుంభమేళాలో మౌని అమావాస్య సందర్భంగా నెలకొన్న రద్దీ కారణంగా తొక్కిసలాట జరిగి పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. “ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళాలో ఈరోజు జరిగిన తొక్కిసలాట ఘటన బాధాకరమని, బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ... క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక కుంభమేళాలో విషాదం చోటు చేసుకుందని... ఇది ఎంతో ఆవేదన కలిగించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. బాధితులకు అందుతున్న వైద్య సాయంపై వివరాలు తెలుసుకుంటున్నామని ప్రధానమంత్రి వెల్లడిస్తూ...

(వాయిస్ 20 సెకన్లు)

================================

దేశ ఆర్థికాభివృద్ధికి ఖనిజాలు కీలకమని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. న్యూఢిల్లీలో ఈ రోజు పాత్రికేయులతో మాట్లాడుతూ, 16 వేల 300 కోట్ల రూపాయల వ్యయంతో నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్ అమలు చేయాలని మంత్రివర్గం నిర్ణయించిందని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర క్యాబినెట్ ఆర్థిక వ్యవహారాల కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. కీలకమైన ఖనిజాల అన్వేషణలో దేశ సామర్థ్యాన్ని పెంచడం, అలాగే ఖనిజాల దిగుమతిపై ఆధారపడటాన్ని తగ్గించడం వంటి లక్ష్యంతో ఈ మిషన్‌కు ఆమోదం లభించిందని వెల్లడించారు. చెరుకు రసం, చక్కెర, చక్కెర సిరప్‌కు లీటరుకు 65.61 రూపాయల ధరను మంత్రివర్గం ఆమోదించిందని తెలిపారు. ఇథనాల్ మిశ్రమం దేశ ఆర్థిక వ్యవస్థకు సహాయపడిందని, సంవత్సరంలో రైతులకు నలభై వేల కోట్ల రూపాయలకు పైగా చెల్లించామని కేంద్రమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 29 సెకన్లు)

================================

భారత గణతంత్ర దినోత్సవ ముగింపు వేడుకలు ఢిల్లీలో ఘనంగా జరిగాయి. ఈరోజు సాయంత్రం విజయ్‌చౌక్ వద్ద సైనిక, పారామిలిటరీ దళాలు నిర్వహించిన బీటింగ్ రీట్రీట్ కార్యక్రమం అలరించింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సహా పలువురు కేంద్రమంత్రులు, ఉన్నతాధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ దళాలకు చెందిన వాయిద్య బృందాలు లయబద్ధంగా సంగీత కార్యక్రమం నిర్వహించాయి. కాగా 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు బీటింగ్ రీట్రీట్‌తో ముగిసాయి.

================================

గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ నెల 26 వ తేదీన న్యూఢిల్లీలోని కర్తవ్య పథ్‌లో జరిగిన పరేడ్ లో ప్రదర్శించిన శకటాలలో 'మహాకుంభ్ 2025 - స్వర్ణిమ్ భారత్: విరాసత్ ఔర్ వికాస్' ఇతివృత్తంతో ప్రదర్శించిన ఉత్తరప్రదేశ్ శకటం మొదటి బహుమతి సాధించగా.... త్రిపురకు చెందిన 'ఖార్చీ పూజ' శకటానికి రెండవ స్థానం లభించింది. ఆంధ్రప్రదేశ్ కు చెందిన 'ఏటికొప్పాక బొమ్మలు' శకటం 3వ స్థానంలో నిలిచింది.

================================

ఉత్తరాఖండ్, పంజాబ్, హర్యానా, చండీగఢ్, సబ్ హిమాలయన్ పశ్చిమ బెంగాల్ సిక్కింలలో ఈరోజు దట్టమైన పొగమంచు ఏర్పడిందని భారత వాతావరణ శాఖ పేర్కొంది. ఉత్తరప్రదేశ్, గంగానది పశ్చిమ బెంగాల్, తీర ఒడిశా, బీహార్‌లోని కూడా ఇలాంటి పరిస్థితులు 2 - 3 రోజుల పాటు కొనసాగనున్నాయని పేర్కొంది. అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, మేఘాలయలో రానున్న రెండు రోజుల పాటు ఉరుములతో కూడిన తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. రాబోయే నాలుగు రోజుల్లో వాయువ్య, మధ్య, అలాగే తూర్పు భారతదేశంలో ఉష్ణోగ్రత 2 - 4 డిగ్రీల సెల్సియస్ పెరుగుతుందని వాతావరణ శాఖ తెలియజేసింది.

విరామం

================================

ఇస్రో చేపట్టిన వందవ ప్రయోగం విజయవంతమైంది. ఈరోజు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరి కోటలో షార్ నుంచి ఇస్రో ప్రయోగించిన జీఎస్ఎల్వీ ఎఫ్-15 రాకెట్ నింగిలోకి ప్రవేశపెట్టింది. ఈ రాకెట్ ఎన్‌వీఎస్-02 ఉపగ్రహాన్ని రోదసిలోకి తీసుకెళ్లింది. భారత నావిగేషన్ వ్యవస్థ నావిక్ సిరీస్‌లోని ఈ రెండో ఉపగ్రహం కచ్చితమైన పొజిషన్, వేగం, టైమింగ్‌తో భారత ఉపఖండం అవతల 1500 కిలోమీటర్ల పరిధి వరకు యూజర్లకు కచ్చితమైన గమన సూచనలు అందిస్తుంది. జీఎస్ఎల్వీ-ఎఫ్12 మిషన్‌లో ఎన్‌వీఎస్-01 ఉపగ్ర హం గతేడాది మే 29 విజయవంతంగా అంతరిక్షంలోకి ప్రవేశించింది.

కాగా ఈ ఉపగ్రహం అందించే నావిగేషన్ సమాచారాన్ని గగనతల, భూతల, జల మార్గాల్లో ఉపయోగించుకోవచ్చు. విమానాల నిర్వహణకు, మొబైల్స్‌లో స్థాన ఆధారిత సేవలకు, ఉపగ్రహాల కక్ష్య నిర్ధారణకు, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ ఆధారిత అప్లికేషన్లకు ఈ ఉపగ్రహపు నావిగేషన్‌ను వాడుకోవచ్చని ఇస్రో తెలియజేసింది.

(వాయిస్ 26 సెకన్లు)

================================

పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ఈ నెల 31వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం రేపు ఉదయం 11 గంటల 30 నిమిషాలకు రక్షణ మంత్రి రాజనాథ్ సింగ్ నేతృత్వంలో అఖిలపక్ష భేటీ జరగనుంది. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెట్టే పలు బిల్లులు తదితర అంశాలపై రాజనాథ్ సింగ్ వివరించనున్నారు. కాగా పార్లమెంట్ సమావేశాలు ప్రారంభంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉభయసభలను ఉద్దేశించి లోకసభ లో ప్రసంగించనున్నారు. ఈసారి రెండు విడతల్లో పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు జరగనుండగా... మొదటి విడత సమావేశాలు ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 13 వరకు, రెండవ విడత సమావేశాలను మార్చి 10 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు నిర్వహించనున్నారు. కాగా ఫిబ్రవరి 1న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర బడ్జెట్ పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నారు.

================================

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాలో చోటు చేసుకున్న తొక్కిసలాటలో సుమారు 30 మందికి పైగా మరణించారన.. 60 మంది గాయపడ్డారని మహాకుంభ్ డీఐజీ వైభవ్ కృష్ణ తెలియజేస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

================================

పశ్చిమ సౌదీ అరేబియాలో జియాన్ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తొమ్మిది మంది భారతీయులు మృతి చెందారు. జెడ్డాలోని భారతీయ రాయబార కార్యాలయం ఈ వివరాలు వెల్లడించింది. జిజాన్ సమీపంలోని జరిగిన రోడ్డు ప్రమాదంలో తొమ్మిది మంది భారతీయ పౌరులు మరణించడంపై ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసింది. అధికారులతోనూ, మృతుల కుటుంబాలతోనూ ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతన్నట్టు తెలిపింది. హెల్ప్‌లైన్ సైతం ఏర్పాటు చేసినట్టు పేర్కొంది.

================================

వక్ఫ్ (సవరణ) బిల్లు, 2024పై పార్లమెంటు సంయుక్త కమిటీ ఈరోజు తన ముసాయిదా నివేదికను ఆమోదించింది. న్యూఢిల్లీలో ఈ రోజు ప్యానెల్ చైర్మన్ జగదాంబిక పాల్ పాత్రికేయులతో మాట్లాడుతూ... బిల్లుకు సంబంధించిన 14 క్లాజులకు సవరణలను కమిటీ ఆమోదించిందని తెలిపారు. ఈ నివేదికను రేపు లోకసభ స్పీకర్ ఓం బిర్లాకు సమర్పిస్తామని అన్నారు. గత ఆరు నెలల్లో బిల్లుపై వివరణాత్మక చర్చలు జరిగాయని స్పష్టం చేశారు.

================================
================================